సాక్షి
నిజామాబాద్
సోమవారం । 31 । జూలై । 2023



పర్యాటకాభివృద్ధి జరిగేనా?

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

- 8లో ▸



నాట్లకు జార్ఖండ్ కూలీలు..

ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో వరి నాట్లు వేసేందుకు జార్ఖండ్ నుంచి కూలీలు రావడంతో కూలీల కొరత తీరినట్లయ్యింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.1 /23.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అవినీతి అధికారులపై చర్యలేవి?

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ మాజీ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ అవినీతి, అక్రమాలకు సహకరించిన మాజీ రిజిస్ట్రార్లు, అధికారులు, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం క్యాంపస్‌లో మాట్లాడారు. ఏసీబీ, విజిలెన్స్ విచారణను రాష్ట్ర ప్ర భుత్వం బహిర్గతం చేయాలని, వర్సిటీలోనే పాలక మండలి (ఈసీ) సమావేశం నిర్వహించి అభివృద్ధి, సమస్యలపై చర్చించాలని కోరారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి స్పందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మైదానాన్ని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నా యకులు జక్కుల గజేందర్, సంతోష్, విఠల్, సురేష్, లక్ష్మీనారాయణ, శివసాయి పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు ప్రారంభం



ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రం నుంచి తమిళనాడులోని పుణ్యక్షేత్రం అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఆదివారం ఈ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. ప్రతి పౌర్ణమికి ముందు అరుణాచలంకు బస్సు సౌకర్యం ఉంటుందని ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో– 2 మేనేజర్ వెంకటేషం కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ఆర్‌ఎం ఆఫీస్) దినేశ్‌కుమార్, సూపర్‌వైజర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు ముగ్గురు అధికారులు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికల సమయంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను ఉన్నతాధికారులు భర్తీ చేస్తూ వస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఖాళీగా ఉన్న కమిషనర్ పోస్టును ఇటీవలే భర్తీ చేశారు. దీంతో పాటు, అడిషనల్ కమిషనర్, సెక్రటరీ పోస్టుల్లో కొత్త అధికారులు రానున్నారు. వీరితో పాటు డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంఏ అలీం బదిలీపై రామగుండంకు వెళ్లనున్నారు. హైదరాబాద్ నుంచి అడిషనల్ కమిషనర్‌గా సత్యబాబు, సెక్రటరీగా శ్రీపాద రామేశ్వర్, డిప్యూటీ కమిషనర్‌గా గోపాల్‌రావు రెండ్రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

నిజాంసాగర్ వరద గేట్ల మూసివేత

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాలనుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఆదివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలిపివేశారు. ఎగువనుంచి 4,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1404.68 అడుగుల(17.340 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

కిక్కు పెంచాల్సిందే..

- అమ్మకాలు పెంచాలంటూ వైన్స్‌లపై ఒత్తిడి
- ఉమ్మడి జిల్లాలో వ్యాపారులకు ఉద్దెరకు సరుకు అంటగట్టిన వైనం
- వైన్స్ వ్యాపారుల నుంచి చెక్కులు వసూలు చేసిన ఆబ్కారీ అధికారులు
- నెలాఖరు నేపథ్యంలో ఆ కోటా సరుకూ కొనాలని హుకూం
- సర్పంచ్‌లతో మాట్లాడి బెల్ట్ దుకాణాలను తెరిపించిన సిబ్బంది
- మద్యం దుకాణాల సమీపంలోనే డ్రంకెన్ డ్రైవ్‌లతో వ్యాపారుల గగ్గోలు
- మా టార్గెట్ మాదే అంటున్న పోలీసుశాఖ



95 శాతం లిక్కరే..

బీర్ల అమ్మకాల ద్వారా ఆదాయం తక్కువగా వస్తున్న నేపథ్యంలో వీటి అమ్మకాలను కేవలం 5 శాతం మాత్రమే చేసేలా వైన్స్ వాళ్లకు అతి పరిమితంగా సరఫరా చేస్తున్నారు. అమ్మకాల్లో 95 శాతం లిక్కర్ ఉండాల్సిందేనని ఆబ్కారీ శాఖ నిర్దేశించడం గమనార్హం.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 'తాగాలి.. తాగి ఊగాలి..' అనేది పాత సామెత. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. 'మరింతగా తాగాలి.. డ్రంకెన్ డ్రైవ్‌కు చిక్కి వేసినంత జరిమానా కట్టాలి' అనేలా పరిస్థితి తయారైంది. ఈ నేపథ్యంలో వైన్స్ వ్యాపారులను లిక్కర్ అమ్మకాలు పెంచాలంటూ ఆబ్కారీ అధికారులు మెడమీద కత్తి పెట్టినట్లు వ్యవహరిస్తుండడంతో గగ్గోలు పెడుతున్నారు. బీర్ల అమ్మకాలను నామమాత్రం చేసి లిక్కర్ అమ్మకాలు భారీగా పెంచాలంటుండడంతో వ్యాపారులు గుస్సా అవుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 180 వైన్స్‌లు ఉన్నాయి. కాగా గతంలో ఎన్నడూ లేని విధంగా తాజాగా ఉమ్మడి జిల్లాలోని అన్ని వైన్స్‌లకు రూ. 10 లక్షల మేర అరువు మీద సరుకు అంటగట్టారు. వ్యాపారులు అయిష్టంగానే తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వ్యాపారుల వద్ద నుంచి బలవంతంగా ఇప్పటివరకు రూ. 13 కోట్ల మేర చెక్కులు వసూలు చేశారు. ఈ చెక్కులకు సంబంధించిన మొత్తాన్ని ఆగస్టు 3న చెల్లించాలని డెడ్‌లైన్ విధించారు. ఇది చాలదన్నట్లు ఈ నెలాఖరుకు సంబంధించిన టార్గెట్ మేరకు కూడా నగదు చెల్లించి సరుకు తీసుకోవాల్సిందేనని హుకుం జారీ కావడంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనాభా ఆధారంగా, గతంలో జరిగిన అమ్మకాల మేరకు లక్ష్యం విధించారు. అమ్మకాలు తగ్గితే సదరు వైన్స్‌లపై కేసులు నమోదు చేయాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయిలో అధికారులు కూడా వాపోతున్నారు. వర్షం కారణంగా అమ్మకాలు తగ్గినా ఊరుకునేది లేదని కమిషనరేట్ నుంచి కోప్పడుతుండడంతో అధికారులు సైతం టెన్షన్‌పడుతున్నారు. అమ్మకాల పెంపు కోసం ఆబ్కారీ అధికారులు సర్కిల్స్ వారీగా నిరంతరం స మావేశాలు పెడుతున్నారు. అమ్మకాలు తగ్గితే మా త్రం ఆయా ప్రాంతాల్లో నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యం వస్తుందంటూ వైన్స్ వ్యాపారులను తిడుతుండడం విశేషం. ఉమ్మడి జిల్లాలో కొందరు ఆబ్కారీ సీఐలు దగ్గరుండి వ్యాపారులకు అప్పులిప్పించి మరీ సరుకు కొనిపించిన సందర్భాలు అనేకమున్నాయి.

మరోవైపు పోలీస్‌శాఖ..

మద్యం అమ్మకాల విషయంలో ఆబ్కారీ శాఖ ఒక్క చిన్న అవకాశం కూడా వదలట్లేదు. ప్రభుత్వం కూడా అమ్మకాల విషయంలో తగ్గేదే లేదంటోంది. 2021 నవంబర్‌లో లాటరీ ద్వారా వైన్స్‌లు దక్కించుకున్నవాళ్లు డిసెంబర్ 1 నుంచి షాపులు ప్రారంభించాల్సిన నేపథ్యంలో నవంబర్ 28వ తేదీనే వాళ్లకు సరుకు అంటగట్టారు. షాపులు సమయానికి దొరకని వాళ్లు టెంటు వేసైనా సరే డిసెంబర్ 1న అమ్మకాలు ప్రారంభించాలని ప్రభుత్వం తహసీల్దార్ల ద్వారా ఆదేశాలు జారీ చేయించడం గమనార్హం. అయితే వైన్స్ వ్యాపారులు, పోలీసులు నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ విషయమై ప్రస్తావించారు. ఆబ్కారీ అధికారులు పోలీసులకు చెప్పినప్పటికీ పోలీసులు మాత్రం తమ టార్గెట్ తమకుందని, డ్రంకెన్ డ్రైవ్‌ను ఆపడం కుదరదని తేల్చిచెప్పడంతో తకరారు పడింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని ఒక చోట ఈ డ్రంకెన్ డ్రైవ్ నేపథ్యంలో ఒక వ్యక్తి వైన్స్ షెట్టర్‌ను కిందికి లాగి అమ్మకాలు చేయవద్దని గొడవ చేశాడు. దీంతో సదరు వ్యక్తిపై ఆబ్కారీ అధికారులు పోలీసు కేసు పెట్టారు. ఇలాంటి ఘటనలు పలుచోట్ల గతంలోనూ చోటుచేసుకున్నాయి. మొత్తంమీద ఆబ్కారీ అధికారులే దగ్గరుండి బెల్ట్ షాపులు మరిన్ని ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తుండడం విశేషం.

అధికారులే అనుమతులిచ్చి..

మద్యం బెల్టు దుకాణాలను నిర్మూలించాల్సిన ఆబ్కారీ అధికారులే వాటిని మరింతగా పెంచేందుకు కృషి చేస్తుండడం విశేషం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొన్ని గ్రామాల్లో వీడీసీలు, మరికొన్ని ప్రాంతాల్లో సర్పంచ్‌లు, పెద్దలు మద్యం అమ్మకాలను లేకుండా చేసేందుకు ఆయా గ్రామాల్లో బెల్టు షాపులను పెట్టకుండా కట్టుబాట్లు విధించారు. ఈ నేపథ్యంలో లిక్కర్ అమ్మకాలను పెంచేందుకు గాను ఆబ్కారీ అధికారులే బెల్టు షాపులు నిర్వహించేందుకు సహకరించాలని ఆయా గ్రామాల పెద్దలను, సర్పంచ్‌లను కలిసి మాట్లాడి ఒప్పిస్తుండడం విశేషం. ఎక్కువమంది సర్పంచ్‌లు బీఆర్‌ఎస్ వాళ్లే కావడంతో ఆబ్కారీ అధికారులు సంక్షేమ పథకాలకు డబ్బులు అవసరమనే మాటలు చెప్పి వారిని ఒప్పిస్తున్నారు. మరో విశేషమేమిటంటే బెల్టు షాపుల జోలికి వెళ్లొద్దంటూ పోలీసులకు సైతం చెప్పడం కొసమెరుపు.

రెండు పంటలకు తిప్పలు తప్పినట్లే..

నిండుకుండలా ఎస్సారెస్పీ

- 85 టీఎంసీలకు చేరిన నీటినిల్వ
- ఇంకో రెండు నెలలు ఎగువ నుంచి వరదొచ్చే అవకాశం
- కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ : ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిండుకండలా మారింది. దీంతో ఆయకట్టుకు రెండు పంటలకు పూర్తి భరోసా వచ్చింది. వానాకాలం, యాసంగి పంటలకు ఢోకా లేకుండా నీటి సరఫరా చేపట్టవచ్చు. గత 10 రోజుల క్రితం వరకు ప్రాజెక్ట్‌లో 23 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కానీ భారీ వర్షాలు కురువడం వల్ల పది రోజుల వ్యవధిలోనే సుమారుగా 100 టీఎంసీల నీరు వచ్చి చేరింది. దీంతో రెండు పంటలకు భరోసాతో పాటు, మిగులు జలాలను గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుండటంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగస్ట్, సెప్టెంబర్ మాసాల్లో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఆగస్ట్, సెప్టెంబర్ మాసాలు వరద వచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్ట్ రికార్డులను పరిశీలిస్తే ఈ రెండు నెలల్లోనే అధికంగా వరద వచ్చి చేరింది. బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అక్టోబర్ 28న మూసి వేయాలి. అప్పటివరకు అంటే మూడు నెలల వ్యవధి ఉంది. కానీ ఈ రెణ్నెళ్లు మాత్రమే వందల టీఎంసీల నీరు వచ్చి చేరింది. గతేడాది ఒక్క సెప్టెంబర్ మాసంలోనే 322 టీఎంసీల వరద నీరు వచ్చిచేరింది. ప్రస్తుత ఏడాది కూడా భారీ వరద నీరు వచ్చిచేరుతుందని ఆయకట్టు రైతులు ఆశాభావంతో ఉన్నారు.

32 టీఎంసీలు గంగపాలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు వస్తుండటంతో ప్రాజెక్ట్ నుంచి వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలారు. గరిష్టంగా 36 వరద గేట్లు ఎత్తి 3 లక్షల క్యూసెక్కుల వరకు వదిలారు. మూడు రోజుల వ్యవధిలో ప్రాజెక్ట్ నుంచి 32 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రస్తుతం ఎగువ నుంచి వరద తగ్గడంతో శనివారం గేట్లను మూసివేశారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు.

కొనసాగుతున్న వరద నీరు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి 8100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 2 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 612 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.10(85 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

ప్రాజెక్ట్‌పై సండే సందడి..



ప్రాజెక్ట్ ఏస్కేప్ గేట్ల ద్వారా నీరు విడుదలవుతున్న ప్రాంతం వద్ద పర్యాటకులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా మారడంతో పర్యాటకులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్ట్ దిగువన గోదావరిలో సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు. ప్రాజెక్ట్ ఆనకట్ట పైకి పర్యాటకులకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో నిరాశ చెందారు. ప్రాజెక్ట్ వద్ద సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. - బాల్కొండ

మంత్రి ఇంటిని ముట్టడిస్తాం



పంటలను పరిశీలిస్తున్న మానాల మోహన్ రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ) : భారీ వర్షాలతో పంటలను తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయకపోతే వేల్పూర్‌లోని మంత్రి ప్రశాంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి హెచ్చరించారు. గతంలోనూ పంటలను రైతులు నష్టపోతే మంత్రి ప్రశాంత్‌రెడ్డి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లారే తప్ప రైతులను ఆదుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఆదివారం ఏర్గట్ల మండలంలోని దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్‌లలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేసేవారమన్నారు. యాసంగిలో అకాల వర్షాలతో పంటలు నష్టపోతే ఎకరానికి రూ.10వేల సాయం ప్రకటించినా ఇంకా చాలమందికి ఇవ్వలేదన్నారు. మంత్రికి సమీక్ష చేసే సమయం లేదా అని ప్రశ్నించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సోమ దేవారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, నాయకులు రవి, లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేష్, సంజీవ్, శ్యాంసన్, రంజిత్, సాయన్న, అన్వేష్, అనిల్ తదితరులున్నారు.

వీసాలివ్వడు.. డబ్బులు తిరిగివ్వడు..

- నిరుద్యోగులను వేధిస్తున్న ఏజెంట్
- మూడు జిల్లాల్లో దాదాపు వంద మంది బాధితులు
- రూ. 2 కోట్ల వరకు వసూలు చేసి ఉడాయించిన వైనం



మోర్తాడ్(బాల్కొండ): యూరప్ దేశాలతో పాటు కెనడా, సింగపూర్, మలేషియా తదితర దేశాల్లో ఉపాధి కల్పిస్తానని నిరుద్యోగులను నమ్మించిన ఒక ఏజెంట్ భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడి ఉడాయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. మోర్తాడ్ మండలంలోని దొన్కల్ జీపీ పరిధిలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి మెట్‌పల్లిలో ట్రావెల్స్‌ను తెరిచి వీసాల దందాకు తెరతీశాడు. విదేశాంగ శాఖ నుంచి ఎలాంటి లైసెన్స్ తీసుకోకుండానే తన ట్రావెల్స్ ద్వారా అనేక మంది నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టాడు. కరోనా తర్వాత గల్ఫ్ దేశాలకంటే పాశ్చాత్య దేశాల్లో ఉపాధి అవకాశాలు పెరిగాయని నిరుద్యోగులను నమ్మబలికాడు. ఒక్కో వీ సా కోసం రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఒరిజినల్ పాస్‌పోర్టులతో పాటు అందినకాడికి నగదును వసూలు చేశాడు. ఢిల్లీలో ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత వీసా రావడానికి టైం పడుతుందని చెప్పి ఇంటికి పంపించిన ఏజెంట్ తన మొబైల్‌లో వీసాల కోసం డబ్బులు ఇచ్చిన వారి నంబర్లను బ్లాక్ చేశాడు. వీసాల కోసం నిరుద్యోగులు ఎంత ఫోన్ చేసినా నంబర్ బ్లాక్ చేసి ఉండడంతో ఫోన్‌లు కలిసే అవకాశం లేదు. కొత్త నంబర్లతో ఫోన్ చేస్తే ఎత్తకుండా ఏజెంట్ సతాయిస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాలకు చెందిన దాదాపు వంద మంది నుంచి రూ. 2 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తుంది. కొన్ని నెలల నుంచి మెట్‌పల్లిలోని ట్రావెల్స్ కూడా మూసి ఉంచడం, అక్కడ అద్దె ఇంటిని ఏజెంట్ ఖాళీ చేయడంతో మోసపోయినట్లు గుర్తైనట్లు బాధితులు గుర్తించారు. జగిత్యాల్‌లో ఇదే కొందరు బాధితులు ఏజెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడ కేసు నమోదైంది. మోర్తాడ్ పీఎస్‌లో కొందరు ఫిర్యాదు చేయగా అధికార పార్టీ నాయకులు పోలీసులపైఒత్తి తెచ్చి ఏజెంట్‌పై కేసు నమోదు కాకుండా చూసినట్లు బాధితులు వెల్లడించారు.

కమీషన్ల కోసమే చెక్‌డ్యాంల నిర్మాణం

- ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం ఇవ్వాలి
- సీఎం దత్తత గ్రామం మోతె పైనే వివక్ష
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

సుభాష్‌నగర్ : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. వేల్పూర్ మండలంలోని మోతె, వేల్పూర్‌ను పరిశీలించామని, సీఎం దత్తత గ్రామం మోతెలో చెక్‌డ్యాంలను నాసిరకంగా నిర్మించారని ఆరోపించారు. చెక్‌డ్యాంల వల్ల మూడేళ్లుగా 800 ఎకరాల వరకు పంట నష్టం జరుగుతోందని, కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైనర్ తానేనని సీ ఎం చెప్తున్నారని, కానీ కాళేశ్వరం పరిస్థితిని మనమంతా చూస్తున్నామన్నారు. సీఎం శిష్యుడు ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గం, సొంత గ్రామంలోనే చెక్‌డ్యాంలు ఈ పరిస్థితిలో ఉన్నాయన్నారు. దత్తత గ్రామమైన మోతెకు సీఎం చేసిన ప్రయోజనమేంటో చెప్పాలన్నారు. కేవలం కమీషన్ల కోసమే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఇటీవల అకాల వర్షాలతో నష్టపో యిన రైతాంగానికి ఎకరానికి రూ.10వేల పరిహారం ఇస్తానని హామీనిచ్చి విస్మరించారన్నారు. భారీ వర్షాలకు జిల్లాలో 33,049 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, 281 ఇళ్లు కూలిపోగా, ఇద్దరు చనిపోయారని, 16 రోడ్లు తెగిపోయాయని అధికారులు తెలిపారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకం సంబంధించి ప్రీమియం చెల్లించకపోవడంతోనే రైతులకు పరిహారం రావట్లేదని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు చెల్లించాలన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, బీఆర్‌ఎస్‌కు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. అకాల వర్షాలు, వరదలకు ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 3,257 కోట్లు విడుదల చేసిందని, కానీ ఏ ఒక్క రైతులకు పరిహారం అందలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులు, కిసాన్ సమ్మాన్ నిధి, మద్దతు ధరలను పెంచుతూ రైతాంగాన్ని ఆదుకుంటుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, పెద్దోళ్ల గంగారెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, దినేష్ కులాచారి, న్యాలం రాజు, స్వామి యాదవ్, స్రవంతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవళిక, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

చెక్‌డ్యాం తెచ్చిన క(న)ష్టం!

- పెద్దవాగు, కప్పలవాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలతో మునిగిన పంటలు
- సుంకెట్ వద్ద మరోసారి తెగిన వైనం
- తొర్తి, శెట్‌పల్లి, వెంచిర్యాల్‌లో భారీగా పంటనష్టం
- అన్ని చెక్‌డ్యాంల పరిసరాల్లో దాదాపు 2 వేల ఎకరాల్లో నష్టం



శెట్‌పల్లిలో చెక్‌డ్యాం పొంగిపొర్లి కొట్టుకుపోయిన వరిపంట



తొర్తిలో కోతకు గురైన చెక్‌డ్యాం కట్ట

మోర్తాడ్/బాల్కొండ : పెద్దవాగు, కప్పల వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంల పరిసరాల్లో పంట పొలాలున్న రైతులకు ఎదురైన దిక్కుతోచని పరిస్థితి ఇది. వాగుల్లో చెక్‌డ్యాంలను నిర్మించడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెంది పంటల సాగుకు నీరు పుష్కలంగా లభిస్తుందని ఆశించిన రైతాంగానికి విభిన్నమైన పరిస్థితి ఎదురైంది. చెక్‌డ్యాంల నిర్మాణానికి హైడ్రాలిక్ అనుమతులు లేకపోవడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, నీటి ఉధృతిని అంచనా వేయకుండా ఎత్తు పెంచడంలాంటి తప్పిదాలతో బాల్కొండ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల రైతుల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యాం కారణంగా సుమారు 300 ఎకరాల్లో పంట నష్టపోయింది. మళ్లీ పంట వేసేందుకు పనికిరాకుండా పోయాయి. పసుపు, సోయా, మక్క పంటలు కూడా కొట్టుకుపోయాయి. వ్యవసాయ అధికారులు పరిశీలించి 300 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని నివేదికిచ్చారు. కాని చెక్ డ్యాంతో వచ్చిన నష్టాన్ని పూడ్చలేకపోయారు.

ఎత్తు తగ్గించాలని వేడుకున్నా..

పెద్దవాగుపై నిర్మించిన ఎత్తును తగ్గించాలని వీడీసీ సభ్యులు అధికారులకు, పాలకులకు విన్నవించినట్లు తెలిపారు. అయినా వారు పట్టించుకోలేదు. గతేడాది జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని చెక్‌డ్యాం వద్ద నీటి ప్రవాహం పక్కకు పొంగుతున్న కారణాలను తెలుసుకుని, నివారణ చర్యలు చేపడితే ప్రస్తుతం ఇంత నష్టం ఉండేది కాదని రైతులంటున్నారు. సుంకెట్ వద్ద నిర్మించిన చెక్‌డ్యాం రెండోసారి కోతకు గురైంది. రెండు వాగులు కలిసే చోట చెక్‌డ్యాంను నిర్మించారు. నీటి ఉధృతిని అంచనా వేయకపోవడం, ఆదరబాదరగానే పనులు పూర్తి చేయడంతో పొలాలు కొట్టుకుపోయాయి. 2021లో ఒకసారి చెక్ డ్యాం కోతకు గురికాగా ఇదే ప్రాంతంలో వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. అప్పట్లో రైతులకు నయాపైసా పరిహారం అందలేదు. శెట్‌పల్లి వద్ద చెక్‌డ్యాం ఎత్తులో నిర్మించడం వల్ల నీరంతా కింది భాగంలోకి వెళ్లకుండా పక్కన ఉన్న పంట పొలాల్లోకి చేరింది. సుమారు 150 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. తొర్తిలో అదే పరిస్థితి. ఇక్కడ కూడా 150 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. భీంగల్ మండలం బెజ్జోరా వద్ద కప్పలవాగు చెక్‌డ్యాం నీరు పక్కన ఉన్న పంట పొలాలను ముంచెత్తింది. భీమ్‌గల్, వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, జక్రాన్‌పల్లి మండలాల్లో ఇప్పటి వరకు 20 చెక్‌డ్యాంలను నిర్మించగా మరో నాలుగు నిర్మాణానికి ప్రణాళిక వేస్తున్నారు.

■ మోర్తాడ్ మండలం సుంకెట్‌కు చెందిన నవీన్ యాదవ్ అనే రైతు పొలం పెద్దవాగులోని చెక్‌డ్యాంకు సమీపంలో ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెక్‌డ్యాం తెగిపోవడంతో నవీన్ పొలం అంతా నీటిమయమైంది. చెక్‌డ్యాం తెగిపోవడంతో ఇసుక పంట పొలాల్లోకి చేరింది. వరి సాగు కోసం నవీన్ పెట్టిన రూ.50వేల పెట్టుబడి నీటిపాలు కాగా ఇప్పుడు ఇసుక మేటలు వేసిన తన పొలాన్ని సాధారణ స్థితికి తీసుకురావాలంటే మరో రూ. 2 లక్షలను ఖర్చు చేయాల్సి వస్తుంది.

అనేక లోపాలున్నాయి..



పెద్దవాగు, కప్పలవాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలలో ఎన్నో రకాల లోపాలు ఉన్నాయి. అధికారుల బాధ్యతారాహిత్యం, మంత్రి ప్రశాంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్లే రైతుల పంట పొలాలు నీట మునుగడానికి కారణమైంది.

– సుంకెట్ అన్వేష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

మూడెకరాలు కొట్టుకుపోయింది..



పెద్దవాగు నీటి ప్రవాహంతో మూడెకరాల మక్క, పసుపు పంట కొట్టుకుపోయింది. గతేడాది కొట్టుకుపోయింది. ఈ ఏడాది కూడా అంత కంటే ఎక్కువే నష్టం జరిగింది. ఇసుక మేటలు పెట్టడంతో పంటను సాగుచేసుకునే పరిస్థితి కూడా లేదు.

– నద్మిడ నరేశ్, రైతు, వెంచిర్యాల్

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి రూరల్: పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఆదివారం కామారెడ్డి జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్యాగరి కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా అడప శ్యామ్, ఉపాధ్యక్షులుగా హస్సన్, శ్రీనివాస్, శంకర్, ఉపకార్యదర్శిగా భాగయ్య, కోశాధికారిగా గంటా లక్ష్మణ్, సలహాదారులుగా పెద్దోళ్ల లింగం, దారవత్ గంగారాం, రఘునాథ్‌రావు, సాయికుమార్, పుష్పాంజలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహాదేవుడి ఆలయంలో జడ్జి పూజలు



దోమకొండ: దోమకొండ గడికోటలోని మహాదేవుడి ఆలయంలో ఆదివారం కామారెడ్డి జిల్లా జడ్జి భార్గవి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఉదయం గడికోటకు చేరుకుని కోటలోని భవనాలను పరిశీలించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు.

కూలిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలి



పెద్దకొడప్‌గల్: వర్షాలకు కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార డిమాండ్ చేశారు. మండలంలోని పోచారం తండాలో ఇళ్లు కూలిపోయిన బాధితులను ఆదివారం ఆమె పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ.. వర్షాలకు కూలిపోయిన ఇండ్లకు ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలాజీ పటేల్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవ్, బబులాల్, రాజేందర్ పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కామారెడ్డి క్రైం: జిల్లాలో పని చేస్తున్న హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆదివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ గతంలో హోంగార్డులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, కానీ నేటి వరకు పర్మినెంట్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బందితో సమానంగా పని చేస్తున్నామని తమను పర్మినెంట్ చేసి ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లాలోని హోంగార్డులు పాల్గొన్నారు.

పంటలు నీటి పాలు



కాద్లాపూర్ శివారులో నీట మునిగిన మొక్కజొన్న



హన్మాజీపేట్ శివారులో నీటమునిగిన పంటలు

- వర్షానికి ఆరుతడి పంటలకు తీవ్రనష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

బాన్సువాడరూరల్: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు ఆరుతడి పంటలకు తీవ్ర నష్టాన్ని కల్గించాయి. మొక్కజొన్న, సోయా, అపరాల పంటలు విత్తుకుని పక్షం రోజులైనా గడువక ముందే భారీ వర్షాలు పంటపొలాలను ముంచెత్తాయి. దీంతో నీరుపట్టిన పంట ఎదుగుతుందో లేదోనని అన్నదాతలు ఆగమవుతున్నారు. వారం రోజుల పాటు వర్షం పడకుండా ఎండలు కాస్తే పంటలపై నమ్మకం పెట్టుకోవచ్చని, మళ్లీ వర్షాలు పడితే ఆరుతడిపై ఆశలు వదుకోవాల్సిందేనని మెట్టప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

తిరిగి విత్తుకోలేని పరిస్థితి

వర్షాలకు నష్టపోయిన పంటల స్థానంలో తిరిగి విత్తుకోవడానికి కాలం అనుకూలించదని రైతులు పేర్కొంటున్నారు. సోయా పంటను తిరిగి విత్తుకోలేమని, మొక్కజొన్న పంటను తిరిగి విత్తుకునే అవకాశం ఉన్నా వర్షాకాలం చివర్లో వానలు పడకుంటే కంకిదశలో పంట ఎండిపోయే ప్రమాదం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరంలో మొక్కజొన్న విత్తడానికి సుమారు రూ.15వేలు ఖర్చు అయ్యాయని, అదనపుభారం భరించలేమని రైతులు చెబుతున్నారు.

మెట్ట ప్రాంతాల్లోనే నష్టం

సాగునీటి సౌకర్యం అంతగా లేని మెట్టప్రాంతాల్లో వర్షాధార పంటలు సాగు చేస్తారు. జిల్లాలోని బాన్సువాడ, గాంధారి, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, తాడ్వాయి, రాజంపేట్, సదాశివనగర్ మండలాల్లో ఎక్కువగా మొక్కజొన్న, సోయా, పత్తి, అపరాల పంటలు సాగుచేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ఆరుతడి పంటలకు నష్టం వాటిల్లింది. పొలాల్లో, చేలల్లో నీరు వెళ్లే వరకు ఎలాంటి ఎరువులు వేయొద్దని, మందులు పిచికారి చేయొద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

అంచనాలతోనే సరి

పంటలకు ఏదైనా నష్టం వాటిల్లితే ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందనే భరోసా ప్రస్తుతం కరువైందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లితే వ్యవసాయ అధికారులు ఆఘమేఘాల మీద వచ్చి పంటనష్టం అంచనా వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు రైతుల నుంచి పంటనష్టం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ గత కొన్నేళ్లుగా ఎలాంటి పరిహారం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పర్యాటక అభివృద్ధి జరిగేనా!

- ప్రాజెక్ట్ హౌస్, పార్కును అప్పగించాలంటున్న టూరిజం శాఖ
- అందుకు సంబంధించిన సర్వే పూర్తి



పార్కును పరిశీలిస్తున్న టూరిజం, ప్రాజెక్ట్ అధికారులు (ఫైల్)

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నా.. అందుకు అడుగులు పడటం లేదు. శ్రీరాంసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామంటు గత కొన్నాళ్లుగా ఊరిస్తునే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు అభివృద్ధి చేసింది లేదు. ప్రస్తుతం ప్రాజెక్ట్ దిగువన ఉన్న పార్కు, పోచంపాడ్ కాలనీలో ఉన్న ప్రాజెక్ట్ హౌస్ ను తమకు అప్పగించాలని టూరిజం అధికారులు, ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పెట్టారు. అందుకు సంబంధించిన సర్వే, పరిశీలన పూర్తయింది. టూరిజం శాఖ అప్పగించుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు ఇది వరకే ప్రకటించారు.

రెస్టారెంట్ ఏర్పాటు!

ప్రాజెక్ట్ హౌస్‌ను తీసుకుని అక్కడ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని టూరిజం శాఖ భావిస్తున్నట్లు తెలిసింది. అందుకు తగిన సర్వేలను ఇది వరకే నిర్వహించారు. పనులు ప్రారంభించడమే తరువాయి. ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటు ముందుకుపోతే పోచంపాడ్‌కు పర్యాటక కల వస్తుందని పర్యాటకులు అంటున్నారు.

పార్క్ నిర్వహణ గాలికి..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద 2014లో రూ.ఆరు కోట్ల తో నెహ్రూ పార్క్‌ను ఏర్పాటు చేశారు. పార్కు నిర్వహణ బాధ్యతను స్థానిక యువజన సంఘాలు ఇన్నాళ్లుగా చూశాయి. కానీ నిర్వహణ సరిగా లేక పోవడంతో ఇది పార్కేనా అన్నట్లుగా మారింది. దీంతో కలహీనంగా తయారైంది. బోటు షికారు కూడా మూలన పడటంతో ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చే వారు కూడా తగ్గారు. టూరిజం శాఖకు అప్పగిస్తే అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

సిద్ధంగా ఉన్నాం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల పార్కును, ప్రాజెక్ట్ హౌస్‌ను పర్యాటక అభివృద్ధి కోసం టూరిజం శాఖకు ఇవ్వడానికి ఇరిగేషన్ శాఖ సిద్ధంగా ఉంది. అందుకు సంబంధించిన సర్వేలు కూడా పూర్తి చేశాం. పర్యాటకంగా అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించారు.

– అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

ఎనీ టైం మక్క కంకులు

- గజ్యానాయక్ చౌరస్తాల్లో అన్ని కాలాల్లో అమ్మకాలు



మక్క కంకులు అమ్ముతున్న మహిళలు

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో అన్ని కాలాల్లో మక్కకంకులు లభిస్తాయి. ఇక్కడ దాదాపు ఓ పది కుటుంబాలు కేవలం మక్క కంకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. సీజన్‌లో లోకల్ కంకులను కాల్చి విక్రయిస్తారు. అన్ సీజన్‌లో స్వీట్‌కార్న్ ఉడకబెట్టి అమ్ముతారు. అటు దుబ్బాక ఇటు కామారెడ్డి, కరీంనగర్ వెళ్లే బస్సులు నిలుపగానే పరుగెత్తుకుంటూ వెళ్లి కంకులను అమ్ముకుంటారు. ఒక్కోసారి ముందుగా కంకులు తీసుకున్న ప్రయాణికులు బస్సు కదలగానే డబ్బులు ఇవ్వకుండానే వెళ్లి పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతజేసినా సరిపడా ఆదాయం లభించడం లేదని వాపోతున్నారు. బస్సు వచ్చినప్పుడు పరుగెత్తుకుంటూ వెళ్లే క్రమంలో కింద పడి గాయాల పాలైన సంఘటనలు కోకొల్లలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తమకు స్వయం ఉపాధి కోసం రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కంకులు విక్రయించే కార్మికులు కోరుతున్నారు.

రుణాలు మంజూరు చేయాలి



గ్రామంలో చేద్దామంటే పని లేక గీ కంకులు అమ్ముకొని బతుకుతున్నాం. సర్కారోళ్లు మాకు రుణాలు మంజూరు చేస్తే స్వయం ఉపాధితో బతుకుతాం.

– పూలి, గజ్యానాయక్ తండా

ఒక్కోరోజు అమ్ముడు పోవు..



ఒక్కో రోజు కంకులు అమ్ముడు పోతాయి. ఆ రోజు మంచిగా కైకిల్ పడ్తది. ఒక్కోసారి అమ్ముడు పోక పశువులకు మేతగా వేయాల్సి వస్తోంది. పొద్దంతా పొయ్యి వద్ద ఉంటూ కంకులను ఉడక బెడితే అనారోగ్యానికి గురికావాల్సి వస్తోంది.

– హెరీ, గజ్యానాయక్ తండా

టమాట@200



బోధన్ సంతలో విక్రయిస్తున్న టమాటలు

బోధన్‌టౌన్: టమాట పేరు వింటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం బోధన్‌లో నిర్వహించే సంతలో టమాట కిలో ధర ఉదయం రూ.200 పలికింది. సాయంత్రం అయ్యే వరకు రూ.160 కు తగ్గింది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు టమాట కొనాలంటే వెనకడుగు వేస్తున్నారు.

వరి నాట్లకు జార్ఖండ్ కూలీలు

- రైతులకు తీరిన కూలీల కొరత
- ఎకరానికి రూ.4500 చొప్పున గుత్త



కొత్తపల్లిలో నాటు వేస్తున్న జార్ఖండ్ కూలీలు

బాల్కొండ: వర్షాలు సమృద్ధిగా కురవడంతో బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. గతంలో నాట్లకు కూలీల కొరత ఉండేది. ప్రస్తుతం వరి నాట్లు వేయడానికి జార్కండ్ నుంచి కూలీలు వచ్చారు. నెల రోజుల క్రితమే గ్రామాల్లోకి వచ్చి చేరారు. గుత్తాగా వరి నాట్లు వేయుటలో బిజీగా ఉన్నారు. దీంతో రైతులకు కూలీల కొరత తీరింది.

గతంలో నాట్లు వేయుటకు కూలీల కొరత తీవ్రంగా ఉండేది. మహిళ కూలీలకు ఒకరికి రూ.500 నుంచి రూ.600 చెల్లించేవారు. ఒక ఎకరా నాటు వేయడానికి ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు అవసరం అయ్యేవారు. పురుషులకు కూలీ రూ.వేయి ఉండేది. దీంతో ఎకరాకు నాటు వేయడానికి రూ.5000 నుంచి రూ.5600 వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం జార్ఖండ్ కూలీలు రూ.4500కు ఎకరా నాటు వేస్తున్నారు. అంతేగాకుండా వేగంగా నాట్లు వేస్తుండటంతో రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతున్నాయి. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో రైతులు అధికంగా వరి నాట్లు కూలీల చేత వేయిస్తున్నారు. ప్రస్తుతం విస్తరంగా వర్షాలు కురువడంతో ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండలా మారియి. దీంతో రైతులు గుంట ఖాళీ లేకుండ వరి సాగు చేస్తున్నారు. అందులో భాగంగానే నాట్లు జోరందుకున్నాయి. జార్ఖండ్ కూలీలు వరి నాట్లు వేయడంలో కొలత ప్రకారం వరుసగా నాట్లు వేస్తున్నారు. దీంతో వరి పంటకు సూర్యరశ్మి సమాపాలల్లో అందడంతో పాటు, పంటకు మందులు పిచికారి చేయుటకు అనువుగా ఉంటుందని రైతులు అంటున్నారు.

నెల క్రితం వచ్చాం



నాట్లు వేయడానికి నెల రోజుల క్రితం వచ్చాం. ప్రతి రోజు పని దొరుకుతోంది. 20 మంది గ్యాంగ్‌గా ఉన్నాం. ఒక్కొక్కరం నెల రోజుల్లో సుమారు రూ.40 వేలు సంపాదిస్తాం. నాట్లు వేయడం చిన్నప్పటి నుంచి అలవాటు.

– రామ్‌లాల్, జార్ఖండ్ కూలీ

వేగంగా పూర్తవుతుంది



జార్ఖండ్ కూలీలు వేగంగా నాట్లు వేస్తున్నారు. ఎకరం పొలం రెండు గంటల్లో వేస్తున్నారు. నారు తీసే పని నుంచి నాట్లు వేసే వరకు వాళ్లే చేస్తారు. రైతులం అడుగు మందు చల్లుకుంటే చాలు.

– వెంకట్‌రెడ్డి, రైతు, కొత్తపల్లి

ముగ్గురిపై డ్రంకన్ డ్రైవ్ కేసు

గాంధారి: గాంధారి ఆదివారం వాహనాలు తనిఖీ చేసి ముగ్గురిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గాంధారికి చెందిన ఉత్తునూర్ రాజు, జువ్వాడికి చెందిన మాధయ్య, చిన్న గుట్ట తండాకు చెందిన కేతావత్ సుభాష్‌పై కేసు చేసినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన పలువురికి జరిమానా వేశామన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 1999–2002 బీఎస్సీ బీజెడ్‌సీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిర పడిన వారు 21 ఏళ్ల తర్వాత పట్టణంలోని ఓ హోటల్‌లో కలుసుకున్నారు. తమ జ్ఞాపకాలను పంచుకున్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ టోర్నీకి ఎంపిక



బంగారు పతకం సాధించిన రిత్విక

నిజామాబాద్‌నాగారం: హైద్రాబాద్‌లోని పబ్లిక్‌స్కూల్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ సబ్ జూనియర్, జూనియర్ టోర్నీలో జిల్లాకు చెందిన మిట్టపల్లి రిత్విక సత్తా చాటింది. జిల్లా తరపున 50, 100, 200మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో బంగారు, 200మీటర్లలో కాంస్య పతకంతో సాధించింది. ఆగస్టు 16 నుంచి 20వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి సబ్‌జూనియర్ టోర్నీకి ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా రాష్ట్ర స్విమింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడీల శ్రీరాములు, మహిపాల్‌రెడ్డి తదితరులు ఆమెను అభినందించారు.

క్రైం కార్నర్

కుంటలో పడి ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నీరేశ్

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి గ్రామానికి చెందిన బేగరి ఈరయ్య (58) పక్కన ఉన్న నీటి కుంటలోపడి మరణించినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. ఈరయ్య కుటుంబ తగాదాలతో మూడు నెలలుగా ఇంటికి వెళ్లడం లేదు. దీంతోపాటు మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన గల నీటి కుంటలో పడి పోయాడు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 26న కొయ్యగుట్టచౌరస్తా వద్ద వర్షంలో తడిసి అనారోగ్యంతో వణుకుతూ కనిపించిన సదరు వ్యక్తిని చూసి స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పాము కాటుతో మహిళ..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండి మాసానిపేట్‌లో బెస్త సుగుణ(40) ఆదివారం తెల్లవారుజామను పాముకాటుతో మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో నిద్రిస్తున్న సుగుణకు పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో గొర్రె..



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో ఆదివారం తాళ్లగుండు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి గొర్రె పోతు మృతి చెందింది. గ్రామానికి చెందిన పిండి ఎర్రన్న తన మేకల మందను మేతకు తీసుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతి చెందిన గొర్రెపోతు విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు.

నదిలో దూకబోయిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

నిజాంసాగర్: మద్యం తాగి మంజీర నదిలో దూకేందుకు వచ్చిన నల్లమడుగు పండరి (34)అనే వ్యక్తిని ఆదివారం పోలీసులు కాపాడారు. వివరాలు.. మండలంలోని గోర్గల్ గ్రామానికి చెందిన నల్లమడుగు పండరి మద్యానికి బానిసయ్యాడు. రోజు మద్యం తాగి భార్య, తల్లిని వేధిస్తున్నాడు. ఈ క్రమంలో చిత్తుగా మద్యం తాగిన పండరి గోర్గల్ నుంచి మండల కేంద్రంలోని మంజీర నది వద్దకు చేరు కున్నాడు. అప్పటికే సమాచారం అందుకున్న హోంగార్డు ఆంజనేయులు మంజీర నది గోడపైకి ఎక్కిన పండరిని కిందకు లాగేశాడు. వెంటనే గోర్గల్ గ్రామస్తులకు సమచారం అందించడంతో కుటుంబీకులు వచ్చి పండరిని ఇంటికి తీసుకువెళ్లారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన



నిజామాబాద్ సిటీ: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, సాధన సంస్థ, రైల్వే చైల్డ్ హెల్ప్ డెస్క్ 1098 గాడ్స్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఆర్‌పీఎఫ్ సూపర్‌వైజర్ ఇన్‌స్పెక్టర్ వీవీ సుబ్బారెడ్డి, సాధన సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు కనబడితే ఆర్‌పీఎఫ్ సిబ్బందికి, చైల్డ్ లైన్ 1098కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది, సాధన సంస్థ కోఆర్డినేటర్ రైల్వేస్టేషన్‌లో, రైళ్లలో పిల్లలను వెతికారు.

పాలనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

సిరికొండ: పాలనలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి ఆరోపించారు. మండలంలోని తూంపల్లి, కొండాపూర్, హుస్సేన్ నగర్, మండల కేంద్రంలో ఆయన ఆదివారం పర్యటించారు. కొండాపూర్ తుంపల్లిలో వర్షాలకు ఇసుక మేటలు వేసిన పొలాలను కొండాపూర్‌లో ధ్వంసమైన ఊర చెరువు అలుగు పరిశీలించారు. వర్షానికి కూలిన ఇళ్లను, ధ్వంసమైన దోండ్ల వాగు వంతెనను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రోడ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయని చెప్పారు. ప్రజలను ఆదుకోడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే సొంత మండలం అయిన సిరికొండను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. చెరువుల అలుగుల ద్వారా వరద నీరు వెళ్లే కాలువలు కబ్జాకు గురైన పట్టించుకోవడం లేదని విమర్శించారు. వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవి, ఎర్రన్న, గౌస్, రాజేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్, సంతోష్, రమేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కదనభేరిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ శివ

తెయూ(డిచ్‌పల్లి): ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆగస్ట్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న తెలంగాణ విద్యార్థి కదనబేరీని విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చుబోయిన శివ కోరారు. ఆదివారం తెయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాలను ఎజెండాగా చేసుకొని విద్యార్థుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాజకీయ స్వలాభం కోసం పేద గ్రామీణ విద్యార్థులు ఉన్నత చదువులు చదవకుండా ఉద్యోగాలను పొందకుండా ఈ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో మార్పు కోసం జరిగే ఈ మహా ఉద్యమంలో ప్రతి ఒక్కరూ ఏకం కావాలన్నారు. సమావేశంలో నాయకులు నవీన్, సాయికుమార్, సాయికృష్ణ, ప్రమోద్, రోహిత్, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.